## క్లుప్తంగా

### ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా సుధాకరాచారి



తొర్రూరు: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) జిల్లా అధ్యక్షుడిగా కొరవి సుధాకరాచారి ఎన్నికయ్యారు. ఎస్‌టీయూ జిల్లా నూతన కమిటీని బుధవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్నుకున్నారు. సంఘ ప్రధాన కార్యదర్శిగా జి.యాకూబ్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులుగా యాకయ్య, చంద్ర ప్రకాష్, ఉపాధ్యక్షులుగా చంద్రమౌళి, శకుంతల, కార్యదర్శులుగా సంపత్‌కుమార్, ఏకాంబ్ర చారి, ఆర్థిక కార్యదర్శి ప్రభాకర్‌రావు ఎన్నికయ్యారు. సభ్యుడిగా హరికృష్ణ నియమితులయ్యారు.

### రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు శిరీష



నెల్లికుదురు: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని ఆలేరు జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకుంటున్న టి.శిరీష ఎంపిక అయినట్లు బుధవారం హెచ్‌ఎం రామదాసు తెలిపారు. ఈనెల 15, 16, 17న మెదక్ జిల్లా తుప్రాన్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలో శిరీష పాల్గొంటుందన్నారు.

### మానవత్వం చాటుకున్న ఎంపీ



మహబూబాబాద్/మహబూబాబాద్ రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళను ఎంపీ మాలోత్ కవిత గమనించి ఆటో ఎక్కించి ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. బుధవారం స్థానిక ఎంపీ క్యాంపు కార్యాలయం నుంచి డోర్నకల్ నియోజకవర్గానికి ప్రచారం నిమిత్తం ఎంపీ వెళ్తున్న క్రమంలో మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం శివారులో రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళను గమనించి, వాహనం దిగి గాయపడిన మహిళను ఎత్తుకుని ఆటోలో ఎక్కించి ఆస్పత్రికి తరలించారు.

### 'సీతారామ' నీళ్లు తీసుకొస్తాం

బయ్యారం: బయ్యారం, గార్ల మండలాల రైతులకు ఉపయోగపడేలా బయ్యారం పెద్దచెరువుకు సీతారామప్రాజెక్టు నీళ్లు తీసుకొచ్చే బాధ్యత మాదేనని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నాయకుడు ఊకే అబ్బయ్య అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అభ్యర్థి హరిప్రియను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సమావేశంలో జెడ్పీ వైస్ చైర్ పర్సన్ బిందు, మార్కెట్ కమిటీ చైర్మన్ హరిసింగ్, వైస్ ఎంపీపీ గణేష్, సొసైటీ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌ను ఓడించాలి

కురవి: బీఆర్‌ఎస్‌ను ఓడించి ప్రతి తల్లిదండ్రి విద్యార్థుల ప్రాణాలను కాపాడాలని కాకతీయ యూనివర్సిటీలో రెండున్నర ఏళ్ల క్రితం ఆత్మహత్య చేసుకున్న బోడ సునీల్‌నాయక్ అన్న బోడ శ్రీనునాయక్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని ఆలయం ఎదుట ప్రొఫెసర్ కోదండరాంతోపాటు పలు యూనివర్సిటీ విద్యార్థులతో కలసి విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో కేయు, ఓయు విద్యార్థులు భరత్‌కుమార్, ప్రవీణ్, స్వాతి, మాలోత్ రమేష్, మాలోత్ గణేష్, మోడెం విక్రం, టీజేఎస్ నేతలు అంబటి శ్రీనివాస్, జోలి సత్యనారాయణ, పిల్లి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# మరోసారి బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించాలి



కోరుకొండపల్లిలో ప్రచారంలో మాట్లాడుతున్న శంకర్‌నాయక్



ఆటోలో వెళ్తున్న వారిని ఓట్లు అభ్యర్థిస్తున్న శంకర్‌నాయక్

● ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ శంకర్‌నాయక్

కేసముద్రం: ప్రజాసంక్షేమం కోసం పాటుపడిన బీఆర్‌ఎస్ పార్టీని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని మహబూబాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని కోరుకొండపల్లి, మెగ్యాతండా, తావుర్యాతండా జీపీ, మహముద్‌పట్నం, పాతతండా జీపీ, తారాసింగ్‌తండా జీపీ, కోమటిపల్లి, కేసముద్రంవిలేజ్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడారు. దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఎన్నికల సమయం రాగానే ఇక్కడికి వచ్చి కాంగ్రెస్, బీజేపీ నాయకులు చెప్పే మాయమాటలను నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. మూడోసారి బీఆర్‌ఎస్‌కే ఓట్లేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కోరుకొండపల్లి గ్రామంలో శంకర్‌నాయక్ గ్యాస్ సిలిండర్‌తో ఇంటింటికి వెళ్లి వినూత్న రీతిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ వోలం చంద్రమోహన్, జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ మర్రి రంగారావు, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాదారపు సత్యనారాయణరావు, కేసముద్రం సొసైటీ చైర్మన్ దికొండ వెంకన్న, నీలం దుర్గేష్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు వెంకన్న, మండల అధ్యక్షుడు నజీర్‌అహ్మద్, ప్రధాన కార్యదర్శి కముటం శ్రీనివాస్, కొండ్రెడ్డి రవీందర్‌రెడ్డి, హరీశ్ నాయక్, మహేందర్‌రెడి పాల్గొన్నారు.

**అయ్యప్ప మాలధారణ స్వీకరణ**

మహబూబాబాద్ రూరల్: అయ్యప్పస్వామివారి ఆశీస్సులతో ఎమ్మెల్యేగా మళ్లీ గెలుస్తానని ఎమ్మెల్యే అభ్యర్థి శంకర్ నాయక్ అన్నారు. పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం ఆయన అయ్యప్పస్వామి మాలధారణ స్వీకరించారు.

# పోరాట స్ఫూర్తిదాత బిర్సాముండా



నివాళులర్పిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: భూమి, భుక్తి, గిరిజనుల విముక్తి కోసం పోరాడిన స్ఫూర్తిదాత, మార్గదర్శి బిర్సాముండా అని గిరిజన సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ కిషన్‌నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బిర్సాముండా జయంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా కిషన్‌నాయక్ మాట్లాడుతూ.. బ్రిటీష్ పాలకుల అణిచివేత, దోపిడీ, దౌర్జన్యాలపై పోరాటం చేసిన మహనీయుడు బిర్సాముండా అని కొనియాడారు. పార్లమెంట్ ఆవరణలో బిర్సాముండా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి, సురేష్, పీవైఎల్ నాయకులు యాకయ్య, డీబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోలెపాక వెంకన్న, డీఎస్‌యూ నాయకుడు శశికుమార్ పాల్గొన్నారు.

## నాయకుల విస్తృత ప్రచారం

సాక్షి నెట్‌వర్క్: ప్రజలు ఆశీర్వదించాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డీఎస్ రెడ్యానాయక్ బుధవారం కురవి మండలంలోని సూదనపల్లి, కందికొండ, అయ్యగారిపల్లి, కొత్తూరు(సీ), నేరడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

**కాంగ్రెస్..**

ప్రజా సంక్షేమం కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి అరేంద్ర వెంకటాచారి అన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని 13వ వార్డు పరిధిలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి మురళీనాయక్ ఆధ్వర్యంలో కేసముద్రంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు.

**బీఎస్పీ**

పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడే విధంగా బీఎస్పీ మేనిఫెస్టో ఉన్నందున రాష్ట్రంలో బీఎస్పీ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ ఇల్లందు అభ్యర్థి బాదావత్ ప్రతాప్ కోరారు.

**సీపీఎం**

ప్రజాసమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న సీపీఎం పార్టీని ప్రజలు ఆదరించి గెలిపించాలని పార్టీ ఇల్లెందు నియోజకవర్గ అభ్యర్థి దుగ్గి కృష్ణ అన్నారు. బయ్యారంలోని ఆయన మాట్లాడారు.

# ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ



డోర్నకల్‌లో ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ

బయ్యారం/గూడూరు/డోర్నకల్: ప్రతీ ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ బుధవారం అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఓటు హక్కు ప్రాముఖ్యతను అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, గార్ల-బయ్యారం సీఐ బాబురావు, ఎస్సై ఉపేందర్, డీఆర్‌డీఓ పీడీ, ఎన్నికల స్వీప్ నోడల్ అధికారి సన్యాసయ్య, బాలూనాయక్, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమన్వయంతో పని చేయాలి

నర్సింహులపేట/దంతాలపల్లి: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డీఎస్.రెడ్యానాయక్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త ఐక్యతతో పని చేయాలని ఎంపీ కవిత అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మాజీ సర్పంచ్, సీనియర్ నాయకుడు కాలసాని దామోదర్‌రెడ్డిని ఆమె మర్యాద పూర్వకంగా కలిసి పార్టీ పరిస్థితిపై మాట్లాడారు. దంతాలపల్లి పెద్దముప్పారంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, వెంకన్న, రమేష్, ఉపసర్పంచ్ కర్ల నాగన్న, రవి పాల్గొన్నారు.

## మైనార్టీల సంక్షేమానికి కృషి

మరిపెడ: ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని రాష్ట్ర సమాచార కమిషనర్ మహ్మద్ అమీర్ హుస్సేన్ ఖాన్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ కేంద్రంలోని నవీన్ గెస్ట్ హౌజ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. ప్రతి ముస్లిం, మైనార్టీలు డీఎస్ రెడ్యానాయక్‌కు ఓటు వేసి గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జాంగిర్ అబ్దుల్ సత్తార్, సయ్యద్ లతీఫ్, అవేజ్ యాకూబ్ పాషా పాల్గొన్నారు.

# ప్రజాసంక్షేమానికే పెద్ద పీట: హరిప్రియ



హరిప్రియకు స్వాగతం పలుకుతున్న మహిళలు



ఇల్లెందులో ప్రచారానికి వెళ్తున్న హరిప్రియ, నాయకులు

ఇల్లెందు: గడిచిన పదేళ్లుగా ప్రజల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలుచేస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఇల్లెందు ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి బానోతు హరిప్రియ తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదిస్తే మూడోసారి కేసీఆర్ సీఎం అయి అన్నివర్గాలను మేలు చేస్తారని చెప్పారు. ఇల్లెందు పట్టనంలోని పలు వార్డుల్లో బుధవారం ఆమె విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా హరిప్రియ మాట్లాడుతూ వార్డుల్లో ఇంటింటికీ వెళ్లినప్పుడు ప్రజాసంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్ద పీట వేసిందని ప్రజలంతా గుర్తు చేస్తున్నారని తెలిపారు. మేనిఫెస్టోలో ప్రకటించినవే కాకుండా మరెన్నో పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌దని చెప్పారు.

ఇల్లెందు పట్టణంతో పాటు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. నియోజవర్గంలోని అన్ని మండలాలల్లో సమపాళ్లలో అభివృద్ధి జరిగిందని, ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు అందినందున మరోమారు తనకు అవకాశం కల్పించాలని హరప్రియ కోరారు. ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మడత వెంకటగౌడ్, నాయకులు, ప్రజాప్రతినిధులు సయ్యద్ ఆజమ్, కటకం పద్మావతి, సామల మాధవి, వెంకట ప్రవీణ్‌నాయక్, బాస శ్రీనివాస్, జేకే శ్రీనివాస్, సుజాత, సందా బిందు, గిన్నారపు రజిత, పరుచూరి వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, రంగనాథ్, హరికృష్ణ, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి



వెంకటాపురం(ఎం) : బతుకమ్మలతో స్వాగతం పలుకుతున్న మహిళలు



వెంకటాపురం(ఎం) : వెల్తుర్లపల్లిలో కూలీలను ఓటు అభ్యర్థిస్తున్న నాగజ్యోతి

● బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి

వెంకటాపురం(ఎం) : ములుగు అభివృద్ధికి కృషి చేసిన బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు అత్యధిక ఓట్లతో గెలిపించాలని ములుగు ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి పిలుపునిచ్చారు. గొత్తికోయ కుటుంబాలకు సహాయం చేస్తున్నానంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేసుకొని వివిధ దేశాల్లో ఉంటున్న ఎన్‌ఆర్‌ఐల నుంచి కోట్ల రూపాయలను ఎమ్మెల్యే సీతక్క దోచుకుందని నాగజ్యోతి అన్నారు. బుధవారం మండలంలోని రామాంజాపూర్, గుంటూరుపల్లి, నారాయణగిరిపల్లె, వెల్తుర్లపల్లి, గుర్రంపేట, పెద్దాపూర్ గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగజ్యోతికి ఆయా గ్రామాల్లో ప్రజలు, మహిళలు కోలాటాలతో నృత్యం చేస్తూ బతుకమ్మలతో స్వాగతం పలికారు. అనంతరం నాగజ్యోతి మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్‌లో వేల కోట్ల కాంట్రాక్టులతో సంపాదించిన అక్రమ సొమ్ముతో ములుగు జిల్లా ఓటర్లను మభ్యపెడుతోందని ఆరోపించారు. వెల్తుర్లపల్లి గ్రామ పరిధి పత్తిచేనులో ఉన్న కూలీల వద్దకు వెళ్లి మాట్లాడారు. కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని నాగజ్యోతి వారిని అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రుద్రమదేవి అశోక్, ఎంపీపీ బుర్ర రజితసమ్మయ్య, బీఆర్‌ఎస్ మూడు మండలాల ఇన్‌చార్జ్ సాంబారి సమ్మారావు, మండల అధ్యక్షుడు లింగాల రమణారెడ్డి, నాయకులు మల్క రమేష్, పోరిక హర్జినాయక్, ఎండి.అల్లిమియా, జగన్‌మోహన్ రావు, కొంతం రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

**సీతక్క బెదిరిస్తోంది: రెడ్కో చైర్మన్**

ములుగు : కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ధనసరి సీతక్క తనను బెదిరిస్తుందని రెడ్కో చైర్మన్ వై.సతీష్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ఆయన బీఆర్‌ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతితో కలిసి ములుగు మండలం దేవగిరిపట్నంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. ప్రాణాలు అడ్డుపెట్టయినా నాగజ్యోతిని గెలిపించుకుంటామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తీరును ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

## సంక్షిప్త సమాచారం

**చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి**

మహబూబాబాద్ రూరల్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మహబూబాబాద్ టౌన్ సీఐ వై.సతీష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏటిగడ్డ తండాలో బుధవారం రాత్రి పోలీసు కళాజాతా నిర్వహించారు. ఎస్సైలు విజయరాంకుమార్, దీపికరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్ నుంచి సస్పెన్షన్**

నెల్లికుదురు: తొర్రూర్ ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ జిలుక యాలాద్రిని బీఆర్‌ఎస్ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు మండల అధ్యక్షుడు పరుపాటి వెంకట్ రెడ్డి బుధవారం తెలిపాడు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున సస్పెండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**అన్యాయం చేశారు**

మహబూబాబాద్: కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నూనావత్ రాధా మానుకోట నియోజకవర్గ కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. కాగా ఈనెల 15న అభ్యర్థుల ఉపసంహరణ గడువు ఉండగా.. తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. తనకు అన్యాయం చేశారని కంటతడి పెట్టుకున్నారు. గత ఎన్నికల్లో టికెట్ ఆశించగా టికెట్ ఇవ్వలేదని, ఈసారి తప్పనిసరిగా టికెట్ వస్తుందని ఆశించినా రాలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, సతీష్, అమరేందర్‌రెడ్డి, ఉప్పలయ్య, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

**స్వయంపాలన దినోత్సవం**



మహబూబాబాద్ రూరల్: మండలంలోని కంబాలపల్లి జెడ్పీ హైస్కూల్లో స్వయంపాలన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్ బాబు, ఉపాధ్యాయులు విష్ణువర్ధన్, రామ సహాయం శ్రీధర్ రెడ్డి, ఉప్పలయ్య, సోహెన్ బీ, కాసం శ్రీనువాస్ రావు, తిరుపతి, సోమేశ్వర్, ఝాన్సీ, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

**పోలీసుల కవాతు**

గార్ల: ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరుతూ బుధవారం మండలంలోని గోపాలపురం, చిన్నబంజర పంచాయతీలో కేంద్ర బలగాలతో పోలీస్ కవాతు నిర్వహించామని గార్ల-బయ్యారం సీఐ బాబూరావు, ఎస్సై బానోత్ వెంకన్న తెలిపారు.

**మంత్రి పరామర్శ**

కురవి: సీరోలు మండలం కాంపల్లి గ్రామానికి చెందిన ఐటీడీఏ ఏఈ వడ్డేపల్లి పుల్లయ్య కుమార్తె నీరజ ఇటీవల అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. బుధవారం మంత్రి సత్యవతిరాథోడ్ కాంపల్లికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# కాంగ్రెస్‌తోనే బంగారు భవిష్యత్



బయ్యారం: ఉప్పలపాడు రోడ్డుషోలో మాట్లాడుతున్న కనకయ్య



ఇల్లెందు: కరపత్రాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ డీవీ, నాయకులు

బయ్యారం/గార్ల: కాంగ్రెస్ పార్టీ గెలిస్తే ప్రజలకు బంగారు భవిష్యత్ ఉంటుందని పార్టీ ఇల్లెందు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కోరం కనకయ్య తెలిపారు. అధిష్టానం ప్రకటించిన ఆరు గ్యారంటీలకు మంచి స్పందన వస్తోందని చెప్పారు. బయ్యారం మండలంలోని గురిమెళ్ల, గౌరారం, ఉప్పలపాడు, నర్సాతండా, వెంకట్రాంపురం పంచాయతీల్లో బుధవారం ఆయన రోడ్‌షో ద్వారా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడుతూ బంగారు తెలంగాణ పేరుతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. రానున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని, రాష్ట్రంలోనూ కాంగ్రెస్ అధికారంలోకి రానున్నందున నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల నుంచి వివిధ పార్టీలకు చెందిన నాయకులు కనకయ్య సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి, నాయకులు అయ్యప్పరెడ్డి, సుజాత, జయశ్రీ, మధుకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. కాగా, ఎమ్మెల్యేగా కోరం కనకయ్యను గెలిపిస్తామని బుధవారం గార్లలోని కాటమయ్య గుడి వద్ద గౌడ కులస్తులు పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ సమక్షంలో ప్రతిజ్ఞ చేశారు. నాయకులు శ్రీనుగౌడ్, సమ్మయ్యగౌడ్, కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

**కాంగ్రెస్ గ్యారంటీలకు ప్రజల బ్రహ్మరథం**

ఇల్లెందు: కాంగ్రెస్‌కు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, ఆరు గ్యారంటీ పథకాలతో బ్రహ్మరథం పడుతున్నారని ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, డానియేల్, యదళ్లపల్లి అనసూర్య తెలిపారు. కోరం కనకయ్యను గెలిపించాలని కోరుతూ ప్రచారం చేయగా, కౌన్సిలర్లు, నాయకులు వారా రవి, నవీన్, లక్ష్మి, పత్తి స్వప్న, గోచికొండ శ్రీదేవి, సత్యనారాయణ, ఎస్‌కే.జానీ, ఈసం నర్సింహారావు మెయిన్‌రోడ్‌లో ప్రచారం చేయగా, సత్యనారాయణ, పత్తి స్వప్న, వారా రవి, నవీన్, సాంబమూర్తి, సూర్యం, శ్రీనివాస్, సదానందం, మహబూబ్, సారయ్య పాల్గొన్నారు.

## చిత్రలేఖనంలో విద్యార్థిని ప్రతిభ

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్రారెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని బాణాల చందన చిత్రలేఖనంలో ప్రతిభ చూపడంతో బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ రాజు, అధ్యాపకులు అభినందించారు.

## ప్రలోభాలకు గురి కావొద్దు

తొర్రూరు: ప్రలోభాలకు గురి కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని వినియోగదారుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్, డీసీఐసీ హన్మకొండ జిల్లా అధ్యక్షుడు రతన్‌సింగ్ ఠాకూర్ అన్నారు. వినియోగదారుల ఫోరం ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ కేంద్రంలోని ఆర్యభట్ట హైస్కూల్‌లో ఓటరు చైతన్యంపై కరపత్రాలు ఆవిష్కరించారు.

## నాయకుల మధ్య వాగ్వాదం

కేసముద్రం: మండలంలోని పాతతండాలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ శ్రేణుల మధ్య బుధవారం వాగ్వాదం చోటుచేసుకుంది. ఎమ్మెల్యే అభ్యర్థి శంకర్‌నాయక్ ప్రచారానికి రాగా పదేళ్ల కాలంగా మా తండాకు ఏం అభివృద్ధి చేశావని కాంగ్రెస్ నాయకుడు ప్రశ్నించడంతో అక్కడున్న బీఆర్‌ఎస్ నాయకులు అతనితో వాగ్వాదానికి దిగారు. శంకర్‌నాయక్ అతనిపై చేయి చేసుకున్నట్లు కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు.

# నా జీవితం ప్రజాసేవకే అంకితం



ఎస్ఎస్ తాడ్వాయి: ప్రచారం చేస్తున్న సీతక్క



మంగపేట: కమలాపురంలో..

● కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సీతక్క

ఎస్ఎస్ తాడ్వాయి : మరోసారి ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించాలని.. నా జీవితం ప్రజాసేవకే అంకితం చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సీతక్క అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో సీతక్క మాట్లాడుతూ ములుగు ప్రాంత ప్రజలనే నమ్ముకున్నానని, ఎమ్మెల్యేగా గెలిపిస్తే చివరి శ్వాస వరకు రుణపడి ఉంటానన్నారు. తనను ఓడించేందుకు కేసీఆర్ రూ.200కోట్లు ఖర్చు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. జెడ్పీటీసీగా గెలిచి జెడ్పీ వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైనా బీఆర్‌ఎస్ అభ్యర్థి ఐదేళ్ల పదవి కాలంలో గ్రామాల్లో తిరిగిన దాఖలు లేవని ప్రజల సమస్యలను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. మండలంలోని రంగాపూర్, వీరపూర్, బీరెల్లి, ఆశన్నగూడ ఎల్లాపూర్, అంకపల్లి, నర్సాపూర్, కాటాపూర్, పంబపూర్, దామెరవాయి, గంగారం గ్రామాల్లో సీతక్క ప్రచారం నిర్వహించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లాడి రాంరెడ్డి, మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, పీఏసీఎస్ చైర్మన్ సంపత్, నాయకులు పాల్గొన్నారు.

**సీతక్క గెలుపు కోరుతూ పూజలు**

గంగారం : మండలంలోని కోమట్లగూడెం కోదండ రామాలయంలో ములుగు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ధనసరి అనసూయ (సీతక్క)గెలుపు కోరుతూ ఆమె కోడలు కుంజ కుసుమాంజలి సూర్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**సీతక్కను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి**

మంగపేట: ప్రజాసేవకు అంకితమైన సీతక్కను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య అన్నారు. మండలంలోని కమలాపురంలో సోమయ్య ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులతో కలిసి బుధవారం చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులకు సీతక్కపై మాట్లాడే స్థాయి ఉందా అని ప్రశ్నించారు.